క్లుప్తంగా

కొండచిలువ హతం



నూజివీడు: మండలంలోని అన్నవరం పంచాయతీ శివారు వెంకటాద్రిపురంలో వారం రోజులుగా కోళ్లను తింటూ గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన కొండచిలువను స్థానికులు శుక్రవారం హతమార్చారు. గ్రామంలోని ఖాళీ స్థలాల్లో పెరిగిపోయిన పిచ్చి మొక్కలను పొక్లెయిన్‌తో తొలగిస్తుండగా కొండచిలువ బయటపడింది. వెంటనే దానిని స్థానికులు చంపేశారు.

ప్రణాళికతో చదివితే ఉన్నత శిఖరాలు

మైలవరం: ప్రతి విద్యార్థీ ప్రణాళికా బద్ధంగా చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని స్నేహ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకుడు ఎం.విజయ్‌కుమార్ సూచించారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం సివిల్స్, గ్రూప్–1పై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. సివిల్స్‌కు ఎలా శిక్షణ పొందాలి అన్న అంశాలను విజయ్ కుమార్ వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి యోగా శిక్షణ తరగతులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు జరుగుతాయని యోగా గురువు లంకే జనార్దన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపల్లి బీకాలనీ ఆడిటోరియంలో 15 రోజుల పాటు ఉదయం, సాయంత్రం రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు యోగా మ్యాట్ లేదా మందపాటి దుప్పటి, వాటర్ బాటిల్, నాప్‌కిన్ తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాని సూచించారు. మరిన్ని వివరాలకు 63014 54859 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

మెరుగైన సేద్య పద్ధతులు పాటించాలి



జి.కొండూరు: వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు సేద్యం చేస్తే పంట దిగుబడులు లాభసాటిగా ఉంటాయని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ సూచించారు. మండలంలోని కుంటముక్కల గ్రామంలో శుక్రవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మాధవీలతతో పాటు ఎంపీపీ లక్ష్మీ తిరుపతమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మెరుగైన సేద్య పద్ధతులపై డాక్టర్ మాధవీలత రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ వంగూరి కుమారి కెనడీ, ఏఓ రాంకుమార్, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఉపాధ్యక్షుడిగా గంజా

తిరువూరు: జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ దక్షిణ భారత వైస్ ప్రెసిడెంట్‌గా తిరువూరుకు చెందిన గంజా కృష్ణమోహన్ నియమితులయ్యారు. లయన్స్ క్లబ్, పౌరహక్కుల సంక్షేమ సంఘాల్లో ఆయన సభ్యుడిగా సేవలు అందిస్తున్నారు. మానవ హక్కుల పరిరక్షణకు, సామాజిక అసమానతల తొలగింపునకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

అబీదా బేగంనకు పీహెచ్‌డీ ప్రదానం



ఇబ్రహీంపట్నం: జాకీర్‌హుస్సేన్ కళాశాల వ్యవస్థాపక సభ్యులు, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ సయ్యద్ అహ్మద్ ఆలీ కుటుంబ సభ్యురాలు అబీదాబేగం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డిగ్రీ పొందారు. గణిత ప్రొఫెసర్ అమరేంద్రబాబు పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ ఎంబీజే న్యూట్రోస్కోపిక్ లీ ఐడియల్స్ అండ్ ఫిల్టర్ ఇన్ లాటిక్ ఇంప్లికేషన్ ఆల్జీబ్రాస్' అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ప్రస్తుతం ఆమె భవానీపురంలో ఉంటూ మచిలీపట్నం కృష్ణా విద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో గణిత అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. పలువురు పుర ప్రముఖులు, అధ్యాపకులు అభినందించారు.

ముగిసిన ఆటల పోటీలు

చాట్రాయి: మండలంలోని మర్లపాలెం హైస్కూల్లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను మండల స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు హెచ్‌ఎం డి.హర్ష తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డి.సతీష్, పీఈటీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

కాచవరం(ఇబ్రహీంపట్నం): శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా కాచవరం శ్రీ రామలింగస్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులతో ఆలయ అర్చకుడు కంచిభొట్ల సుబ్రహ్మణ్యశర్మ ప్రత్యేక పూజలు చేయించారు. పార్వతి అమ్మవారికి గాజులు, పసుపు కుంకుమలు, ఫల పుష్పాదులు సమర్పించారు. అమ్మవారిని నగదుతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాలు

చాట్రాయి: మండలంలోని చనుబండ కోదండ రామాలయంలో శుక్రవారం సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు

లక్ష్మీదేవికి విశేష పూజలు

తిరువూరు: శ్రావణమాస చివరి శుక్రవార సందర్భంగా తిరువూరు పట్టణంలోని పలు దేవాలయాల్లో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. శ్రీసంతోషి మాత ఆలయం, రాజుపేట శ్రీఅష్టలక్ష్మి ఆలయం, శాంతినగర్ శ్రీకనకదుర్గ ఆలయం, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం, శ్రీషిర్డిసాయిమందిరాలలో సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

నెమలి ఆలయంలో..

గంపలగూడెం: మండలంలోని నెమలి గ్రామంలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం మహిళలు సామూహికంగా వరలక్ష్మి వ్రతం ఆచరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తిరునగరి గోపాలచార్యులు, అర్చక బృందం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు , మహిళలు పీటలపై కూర్చొని భక్తిశ్రద్ధలతో వ్రతం నిర్వహించారు. వ్రతం విశిష్టతను అర్చకులు ఈ సందర్భంగా వివరించారు. ఈ పూజల్లో ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వర ప్రసాదరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



తిరువూరులో విశేషపూజలు అందుకున్న శ్రీఅష్టలక్ష్మి



ప్రత్యేక అలంకరణలో శ్రీసంతోషిమాత



కాచవరంలో హారతి స్వీకరిస్తున్న భక్తులు



చనుబందలో సామూహిక వరలక్ష్మి వ్రతం ఆచరిస్తున్న మహిళలు

సామూహిక కుంకుమార్చన

గంపలగూడెం: వికాస తరంగిణి ఆధ్వర్యంలో గంపలగూడెంలోని శ్రీరామ భజన మందిరంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం రాత్రి మహిళలు, సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ, కనకధారాస్తోత్రం, అష్టలక్ష్మి స్తోత్రములు, పారాయణలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వికాస తరంగిణి అధ్యక్షురాలు కొల్లా కృష్ణకుమారి, మహిళలు పాల్గొన్నారు.



గంపలగూడెం భజన మందిరంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కాకరలో రసం పీల్చే పురుగుల ఉధృతి

నూజివీడు(ఆగిరిపల్లి): కాకర పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆగిరిపల్లి ఉద్యాన అధికారి కె.జ్యోతీ ప్రియాంక సూచించారు. ఆగిరిపల్లి మండలం కనసాపల్లిలోని కాకర తోటలను ఆమె పరిశీలించారు. రసం పీల్చే పురుగుల వల్ల ఆకు ముడత వచ్చి మొక్కలు పందిరికి అల్లుకోవన్నారు. తద్వారా దిగుబడి తగ్గుతుందని పేర్కొన్నారు. రసం పీల్చే పురుగుల నివారణకు పంట వేసిన 15 రోజులకు ఎకరాకు 12 నుంచి 15 వరకు పసుపు, నీలం, తెలుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అయినప్పటికీ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి ఫిప్రోనిల్ రెండు మిల్లీలీటర్లు, 13–0–45 ఐదు గ్రాములు, సాఫ్ రెండు గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. గ్రామ ఉద్యాన సహాయకుడు పి.రమేష్, రైతులు పాల్గొన్నారు.



కనసానపల్లిలో కాకర పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి కె.జ్యోతీప్రియాంక

12, 13 తేదీల్లో క్రీడా జట్ల ఎంపిక

గంపలగూడెం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12, 13 తేదీల్లో మండల స్థాయి వివిధ క్రీడాంశాల్లో మండల జట్లను ఎంపిక చేస్తామని ఎంఈఓ పి.వి.డి.ఎల్.నరసింహారావు తెలిపారు. గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్–14, 17 విభాగాల్లో తొమ్మిది క్రీడాంశాలకు సంబంధించి బాల బాలికల జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. కబడ్డీ, షటిల్, టెన్నికాయిట్, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, యోగ, అథ్లెటిక్స్ పోటీలకు బాలబాలికలను మండల స్థాయి జట్లకు ఎంపిక చేస్తామని వివరించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి అర్హత కలిగిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు.

ముమ్మరంగా వైద్య శిబిరాలు



చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల పలు గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతుండటంతో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శుక్రవారం 14 గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. 398 మంది రోగులను పరీక్షించి 21 మందికి సాధారణ జ్వరాలు ఉండడంతో ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో నీరు నిల్వలు ఉన్నచోట దోమల నివారణ మందులు పిచికారీ చేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ

గంపలగూడెం: మండలంలోని పెనుగొలను ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం షిరిడీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎ.వి.నరసింహారావు మాట్లాడుతూ.. చదువును మించిన సంపద ప్రపంచంలో మరొకటి లేదన్నారు. చదువుకున్న విద్యార్థులే దేశానికి పెద్ద సంపదని, ప్రతి ఒక్కరు క్రమశిక్షణ పట్టుదలతో చదివి తమ జీవితాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సాయిబాబా సేవా కమిటీ సభ్యులు బహుమతులు, మిఠాయిలు పంపిణీ చేశారు.

నూర్‌బాషా సంఘం మైలవరం అధ్యక్షురాలిగా చిన్న ఖాసీంబీ



షేక్ చిన్న ఖాసీంబీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ నూర్‌బాషా (దూదేకుల) ముస్లిం సంక్షేమ సంఘం ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా గొల్లపూడి పంచాయతీ పరిధిలోని ఇంతియాజ్ నగర్‌కు చెందిన షేక్ చిన్న ఖాసీంబీ నియమితులయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన సంఘ రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో తన పేరును ప్రతిపాదించగా దీనిపై అందరూ ఆమోదం తెలిపారని చిన్న ఖాసీంబీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాజీ (ఎస్ఎస్ బాజీ), రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు టంగుటూరి గౌసియా తనకు నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. సమాజంలో నూర్‌బాషా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని రాష్ట్ర నాయకత్వం సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రకటనలో పేర్కొన్నారు.

పైథాన్ వర్క్‌షాపుతో నైపుణ్యాలు మెరుగు

మైలవరం: పైథాన్ ప్రోగ్రామింగ్ వర్క్‌షాపు వల్ల విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపడతాయని స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ వై.విజయభాస్కరరెడ్డి సూచించారు. మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో పైథాన్ ప్రోగ్రామింగ్ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపర్చుకోని ఉద్యోగావకాశాలు ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. ఏపీఎస్ఎస్‌డీసీ ట్రైనర్ కె.మీనాక్షి రిసోర్స్‌పర్సన్‌గా వ్యవరించి మాట్లాడుతూ.. పైథాన్ ప్రోగ్రామింగ్ ఆవశ్యకతను, ప్రాముఖ్యతను, లూప్స్, డాటా స్ట్రక్చర్స్, ఊప్స్ కాన్సెప్ట్, ఫైల్స్ ఆపరేషన్స్ అండ్ ఫంక్షన్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హరినాథ రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ జె.శివవర ప్రసాద్ పాల్గొన్నారు. సీహెచ్ రాజేష్, జి.తబిత కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు

తిరువూరు: ఉత్తర ప్రదేశ్‌లో న్యాయవాదులపై పోలీసులు దౌర్జన్యం చేసిన ఘటనను నిరసిస్తూ తిరువూరు కోర్టులో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని, యూపీలో న్యాయవాదులపై దాడికి పాల్పడిన పోలీసులను కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంకురాత్రి జనార్దనరావు, అంకిరెడ్డి అంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిరువూరు కోర్టు ఎదుట జరిగిన ధర్నాలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



తిరువూరు కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన

హైస్కూల్లో వార్షిక తనిఖీ

మునునూరు: ప్రణాళిక ప్రకారమే పాఠ్యాంశాలను బోధించాలని డీవైఈఓ సేవియా నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. ముసునూరు హైస్కూల్లో ఆయన అధ్యక్షతన శుక్రవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. తరగతుల్లో పాఠ్యాంశాల బోధనపై తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, క్రమశిక్షణ, కఠోర దీక్షతో ఉన్నత విద్యాభ్యాసం చేయాలన్నారు. ఉపాధ్యాయులంతా సమకాలీన పోటీ పరిస్థితులకు అనుగుణంగా, పాఠ్య ప్రణాళిక ప్రకారమే విద్యా బోధన చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీనివాస్, నాగేంద్రరావు, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



మునునూరు హైస్కూల్లో తనిఖీలు నిర్వహిస్తున్న డీవైఈఓ తదితరులు


కృష్ణాష్టమి వేడుకలు

విస్సన్నపేట: మండలంలో పలు గ్రామాల్లో గురువారం రాత్రి కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఉట్టి కొట్టి వేడుక, ప్రత్యేక పూజలు చేశారు. ద్వారకా నగర్‌లో ఉన్న శ్రీకృష్ణుడి దేవాలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణలో పాల్గొని అలరించారు.



కృష్ణుడి వేషధారణలో ఉట్టి కొడుతున్న చిన్నారి

ముమ్మరంగా వాటర్ ట్యాంకు నిర్మాణం



చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామంలో చేపట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.60 లక్షల వ్యయంతో 90 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, పైపులైన్ నిర్మాణం పనుల ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తి కాగానే చెరువులో మరో బోరు వేసి గ్రామంలో ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగు నీరు సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్య ప్రసాదు తెలిపారు.

అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం

తిరువూరురూరల్: మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం జరిగింది. నిరక్షరాస్యతతో వచ్చే ఇబ్బందులను గుర్తించి ప్రతి విద్యార్థి తన చుట్టుపక్కలవారిని అక్షరాస్యులుగా మలచాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిరాం సూచించారు. విద్యార్థులకు అక్షరాస్యత ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు రాంప్రదీప్, సుదర్శన్, సాంబశివరావు పాల్గొన్నారు.

గొడవలు సృష్టించేందుకే లోకేష్ పాదయాత్ర

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: రాష్ట్రంలో 90 శాతం ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి తెలిపారు. అలజడులు సృష్టించి లబ్ధిపొందాలని తెలుగుదేశం పార్టీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ ప్రచారాలకు జనం రాకపోవడంతో రౌడీమూకలతో అల్లర్లు సృష్టిస్తున్నారని విమర్శించారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన 3,600 కిలోమీటర్ల పాదయాత్రలో ఎటువంటి దుర్ఘటనలూ జరగలేదని గుర్తుచేశారు. ఇప్పుడు లోకేష్ పాదయాత్రలో ఘర్షణలకు కారణమేమిటని ప్రశ్నించారు. ప్రజాతీర్పును గౌరవించలేని టీడీపీ నేతలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. మళ్లీ 2024 ఎన్నికల్లో టీడీపీకి పరాభవం తప్పదని తేల్చి చెప్పారు. తిరువూరు నియోజకవర్గంలో తాను ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్నానని ఎమ్మెల్యే రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టిలేరుపై వంతెన కూడా మంజూరైందన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. తిరువూరు పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా నిమిత్తం కృష్ణాజలాలు తెచ్చే పైలెట్ ప్రాజెక్టు పనులు కూడా త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, తిరువూరు నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరి బాయి, ఎంపీపీ గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ల మోహన్‌రెడ్డి, నగర పంచాయతీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు నల్లకుంట, శాంతినగర్, రాయనపాడు, పైడూరుపాడు, సూరాయిపాలెం, కరకట్ట, పోస్ట్ ఆఫీస్ రోడ్, నేతాజీ నగర్, వాటర్ ఫిల్టర్ బెడ్ ఏరియా, గంగానమ్మ టెంపుల్ ఏరియా, పంచాయతీ ఆఫీస్ ఏరియా, వన్ సెంటర్ ఏరియా, అయ్యప్ప స్వామి టెంపుల్ ఏరియా, దత్త కల్యాణ మండపం ఏరియా, మరనాత చర్చి ఏరియా, వాసవి ఫార్మా మెడికల్ కాంప్లెక్స్, వస్తులత కాలనీ, ట్రిబుల్ ఎస్ కాలనీ, హెడ్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు నూజివీడులో విద్యుత్ సరఫరా నిలుపుదల

నూజివీడు: స్థానిక ట్రిపుల్‌ఐటీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీసీపీడీసీఎల్ పట్టణ డీఈ ఓలేటి దుర్గారావు తెలిపారు. గాంధీనగర్, నందనంతోట, గొడుగువారిగూడెం, ఏరియా ఆస్పత్రి రోడ్డు, మైలవరం రోడ్డు, ఉషాబాల నగర్, యానాదుల కాలనీ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పల్లెర్లమూడిలో ఆటలపోటీలు

నూజివీడు: మండలంలోని పల్లెర్లమూడిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీడీఓ వి.ఎ.విజయ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ఆటలపోటీల వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించడమే కాకుండా ఐకమత్యం, పట్టుదల, ఓటమిని తట్టుకునే శక్తి, శారీరక, మానసిక దారుఢ్యం పెరుగుతాయని సూచించారు. విద్యకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో ఆటలకు కూడా అంతే ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. బాలికలకు వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, యోగా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పల్లెర్లమూడి హైస్కూల్ హెచ్‌ఎం హనుమంతరావు, ఎంపీటీసీ చిలుకూరి అనూర్‌బాషా, దాత యనమదల వెంకటేశ్వరరావు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆటల పోటీల ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ విజయ్‌కుమార్

విద్య, విజ్ఞానంతో ఉన్నతమైన జీవనం

మైలవరం: ప్రపంచం అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు విద్య, విజ్ఞానం ఎంతో అవసరమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని, మన బడి నాడు – నేడుతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వసతులు సమకూర్చుకుంటున్నాయని వివరించారు. నాణ్యమైన ఉచిత విద్యను అందించడంతో పాటు గోరుముద్ద, విద్యా కానుక, ట్యాబ్స్ పంపిణీ, ఆంగ్ల మాధ్యమంలో బోధన, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేస్తూ ఎన్నో విప్లవాత్మక మార్పులను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా మనమంతా మరింత బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మైలవరం శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించారు.

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మొర్సుమల్లి(మైలవరం): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మొర్సుమల్లి సర్పంచ్ మాడపాటి రమాదేవి సూచించారు. మైలవరం మండలం మొర్సుమల్లి తండాలో కేఎల్ యూనివర్సిటీ స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్, స్మార్ట్ విలేజ్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో ఫార్మసీ, బయోటెక్నాలజీ విద్యార్థులు గ్రామస్తులకు శుక్రవారం బ్లడ్ గ్రూప్ పరీక్షలు, బీపీ పరీక్షలు చేశారు. తండాలోని ప్రతి ఒక్కరి ఇంటికీ వెళ్లి ఈ సేవలు అందించారు. 150 మంది గ్రామస్తులకు రక్త పరీక్షలు నిర్వహించి బ్లడ్ గ్రూప్ తెలిపామని ఫార్మసీ అధ్యాపకురాలు డాక్టర్ సుకీర్తి పేర్కొన్నారు. కేఎల్ యూనివర్సిటీ స్మార్ట్ విలేజ్ కోఆర్డినేటర్ పి.వి.సత్యనారాయణ, ఏఎన్‌ఎం యు.రాజేశ్వరి, ఆశా వర్కర్ పార్వతి, గ్రామస్తులు, ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొర్సుమల్లి గ్రామంలో గ్రామస్తులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహిస్తున్న ఫార్మసీ విద్యార్థులు

లోను మేళా సద్వినియోగం చేసుకోవాలి

జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి

విస్సన్నపేట: జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ద్వారా మహిళా పాడిరైతులకు, డ్వాక్రా మహిళలకు గేదెల కొనుగోలుకు నిర్వహిస్తున్న లోన్ మేళాను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద జగనన్న పాలవెల్లువకు సంబంధించి పాడిగేదెలు కొనుగోలుకు శుక్రవారం లోన్ మేళా నిర్వహించారు. అర్హులైన ప్రతిఒక్క డ్వాక్రా మహిళ జగనన్న పాలవెల్లువ కేంద్రాలకు పాలు పోసి అధిక ధరలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఉపసర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ శేషగిరి, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, ఏడీ శ్రీనివాస్, ఏపీఎం జమలయ్య పాల్గొన్నారు.